సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ¦ 4 ¦ జూలై ¦ 2023

మాస్కులు ధరించి.. శుభాకాంక్షలు తెలిపి



మాస్కులు ధరించిన క్రీడా పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: ఎమ్మెల్యే జోగు రామన్న ముందస్తు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడాపాఠశాలలో సోమవారం నిర్వహించారు.విద్యార్థులు ఎమ్మెల్యే రామన్న మాస్కులు ధరించి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో



కైలాస్‌నగర్: ఉట్నూర్ ఐటీడీఏ నూతన పీవోగా చాహత్ బాజ్‌పాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.











ఉట్నూర్ ఆర్డీవో బదిలీ



బదిలీపై వెళ్తున్న ఆర్డీవో సురేశ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్ ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. 2022 నవంబర్ 11న ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఆయన అనతి కాలంలోనే బదిలీపై వెళ్తుండడం గమనార్హం.

విద్య, వైద్యంపై దృష్టి

- పోడు పట్టాల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు
- గిరిజన సమస్యలపై అవగాహన ఉంది
- ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో

సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వందశాతం దరిచేరేలా కృషి చేస్తానని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె రోజంతా బిజీబిజీగా గడిపారు. ఉదయం 9గంటల్లోపే ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత ఉట్నూర్ చేరుకున్నారు. తొలిరోజు గ్రీవెన్స్‌లో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అంతకుముందు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది నూతన పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టనుండగా వాటి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో చాహత్ బాజ్‌పాయ్ 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సాక్షి: గిరిజన సమస్యలపై అవగాహన ఉందా..?

పీవో: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తుండగా గిరిజన సమస్యలపై అనేక మంది నన్ను కలవడం జరిగింది. ఆదివాసీ, గిరిజన సమస్యలపై అవగాహన ఉంది. ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

సాక్షి: విధుల నిర్వహణలో మీ ప్రాధాన్యత అంశాలు..?

పీవో: గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, వైద్య సేవలు మరింతగా మెరుగుపరిచే విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాను. ప్రభుత్వ పథకాలను వంద శాతం గిరిజనులకు అందేలా తొలిరోజు నుంచే నా ప్రయత్నం కొనసాగుతుంది.

సాక్షి: వసతిగృహాల్లో సమస్యలు పేరుకుపోయాయి. సరుకుల పంపిణీ జరగడం లేదు. మీ దృష్టికి వచ్చిందా..?

పీవో: వసతిగృహాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతాను. ఈ విషయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో చర్చిస్తాను. సరుకుల పంపిణీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

సాక్షి: ఐటీడీఏ సమావేశాలు నిరంతరంగా జరగడం లేదు. ఈ విషయంలో మీరేమంటారు..?

పీవో: బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐటీడీఏలోని అన్ని విభాగాల అధికారులతో వివిధ అంశాలపై చర్చించాను. ఐటీడీఏ సమావేశాలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపడతాను.

సాక్షి: పోడు పట్టాల పంపిణీలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

పీవో: పోడు పట్టాల పంపిణీ మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో ప్రారంభించనున్నాం. ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపడతాం. ఏజెన్సీ ప్రాంతాల్లో దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణి అర్జీలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెండింగ్ దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద రైతుల నిరసన

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు, రైతులు, రాజకీయ పార్టీలు చేపట్టిన ఆందోళనలతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది.

- జీవో 58 ద్వారా 12 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సర్వే నంబర్ 170తో పాటు ఇతర కాలనీల్లోని ప్రజలకు జీవో 58 ద్వారా పట్టాలు పంపిణీ చేయాలన్నారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆందోళన చేపట్టారు. కొత్త మెనూ సవరించాలని, ఎన్జీవోలకు ఎండీఎం బాధ్యతలు అప్పగించే యత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకుడు చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.
- ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని తలమడుగు జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాళ్ల వాన కారణంగా మండలంలో సుమారు 12 వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. సర్వే నిర్వహించి 15 రోజుల్లో పరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు నెలలు గడుస్తున్నా ఇవ్వలేదన్నారు. వారికి వెంటనే పరిహారం ఇవ్వాలని, లేకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు.
- తమ సమస్యల పరిష్కారం కోసం కొద్ది రోజు లుగా ఆందోళన సాగిస్తున్న దివ్యాంగులు సోమవా రం కలెక్టర్‌చౌక్‌లో రాస్తారోకోతో నిరసన తెలిపారు. దివ్యాంగుల కాలనీపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన సాగిస్తామన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం ఉదయం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో పీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఇందులో గాదిగూడ మండలం కాండో గ్రామానికి చెందిన హెరకుమ్ర షేకు తమ గ్రామంలో రేషన్ బియ్యం నిల్వ కోసం భవనం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. అలాగే పెంబి మండలం పోచంపెల్లి గ్రామానికి చెందిన గుగ్లావత్ వనిత సాగు పట్టా మంజూరు కోసం, ఇంద్రవెల్లి మండలం మారుతిగూడ గ్రామస్తులు పక్కా ఇళ్లు ఇప్పించాలని, ఆదిలాబాద్ మండలం అంకాపూర్ గ్రామస్తులు తమ గ్రామానికి తాగునీరు, విద్యుత్, రోడ్లు మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. వీటితో పాటు వివిధ సమస్యలపై పలువురు దరఖాస్తులు సమర్పించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్రీజ, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఐటీడీఏ ఏవో రాంబాబు, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో కలెక్టర్, పీవో పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ ఛైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు దాదారావ్, బాదిరావ్, దేవ్‌రావ్, మానిక్‌రావ్, గ్రామస్తులుభీంరావ్, సాగర్ ఉన్నారు.

ఆ దుండగులను ఉరి తీయాలి

- కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

కైలాస్‌నగర్: తోటి తెగకు చెంది న కుడ్మెత జంగుబాయిపై లైంగికదాడికి పాల్పడి ఆపై హత్య చేసిన దుండగులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఆది వాసీలు సోమవారం ఆందోళన చేపట్టా రు. ఆదివాసీ బిరుదు గోండ్ యువసేన, మహిళ సంఘం ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంప్రదాయ తుడుం, డోలు మోగిస్తూ స్థానిక ఆర్‌అండ్‌బీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడి ప్రధాన గేటు ఎదుట బైఠాయించి దుండగులను శిక్షించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, నిత్యం ఆదివాసీ మహిళలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇతర కులాల్లో ఇదే ఘటన జరిగితే ఎన్‌కౌంటర్ చేసేవారన్నారు. ఆదివాసీలపై వివక్ష సరికాదన్నారు. దుండగులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు బాధితురాలి కుమారుడి ఉన్నత చదువు బాధ్యత ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ వారి వద్దకు రాగా దుండగులను ఉరి తీయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈమేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నా రు. ఐటీడీఏ డీడీని బాధిత ఇంటికి పంపించి స్థితిగతులు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ప్రత్యేక కేసుగా పరిగణలోకి తీసుకుని వీలైనంత త్వరగా కోర్టుకు సాక్ష్యాలు అందించేలా పోలీసులకు సూచించినట్లు తెలిపారు. దీంతో ఆదివాసీలు తమ ఆందోళనను విరమించారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు

కలెక్టర్ రాహుల్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఐటీడీఏ పీవో, అధికారులు

కైలాస్‌నగర్: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వివిధ అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న ఆయా సంక్షేమ కార్యక్రమాల ప్రగతి, తదితర అంశాలను వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ధరణిలో నూతన పట్టాదారుల బ్యాంక్ వివరాలు సేకరించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. హరితహారానికి కావాల్సిన మొక్కలను శాఖల వారీగా సిద్ధం చేసుకోవాలన్నారు. బీసీ కులవృత్తులకు లక్ష ఆర్థిక సాయం కింద వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. రెండో విడత పంపిణీ చేసే గొర్రెల యూనిట్ లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందులో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ఎం.నటరాజన్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, డీఆర్డీవో కిషన్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని పెంపొందించేలా ఆవిష్కరణలు

కైలాస్‌నగర్: సంస్కృతిని పెంపొందించేలా ఆవిష్కరణలు ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేటర్‌పై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సృజనాత్మకతతో నేటి సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేసిన వారిని ప్రోత్సహించేలా ఇంటింటా ఇన్నోవేటర్ కింద ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్, వీడియోను ప్రతిఒక్కరికి తెలిసేలా వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది నూతన ఆవిష్కరణలు చేస్తే వాటికి సంబంధించి 4 ఫొటోలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కరించిన వారి ఫొటో ఇతర వివరాలను 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేటర్‌కు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నటరాజన్, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, టీఎస్ఐసీ బృందం సభ్యులు పవన్, ఆదర్శ్ మహేంద్ర, ఈడీఎం రవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి తెచ్చిన తంటా..

ఆదిలాబాద్‌టౌన్: ఓ ప్రేమ పెళ్లి వివాదం తెచ్చిపెట్టింది. పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన ఓ యువకుడు, శాంతినగర్‌కు చెందిన యువతి ప్రేమించుకున్నారు. ఇరువురి కుటుంబీకులు వీరిప్రేమకు అడ్డు చెప్పారు. ఈ క్రమంలో స్థానిక దస్నాపూర్ రామాలయంలో సోమవారం పెళ్లి చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా పెళ్లి విషయం తమకు ఎందుకు చెప్పలేదని ఇరువురి కుటుంబీకులు వారి స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇరువురు కుటుంబీకులు, బంధువులు ఫిర్యాదు చేసేందుకు రాత్రి వన్‌టౌన్‌కు చేరుకున్నారు. దీంతో స్టేషన్ వద్ద రాత్రి హైడ్రామా నెలకొంది. ఇరు కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నేడు ఆకాశవాణిలో ఫోన్ ఇన్

ఎదులాపురం: ఆకాశవాణి ఆదిలాబాద్‌లో మంగళవారం ప్రసారమయ్యే ఫోన్ - ఇన్‌లో వాననీటి సంరక్షణకు గల అవకాశాలు, నీటి కుంటల ప్రాముఖ్యత అంశంపై ప్రత్యేక కార్యక్రమం ప్రసారం అవుతుందని ముఖ్యకార్యక్రమ నిర్వహణ అధికారి రామేశ్వర్ కేంద్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రోతలు, రైతులు ఫోన్ ద్వారా అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ సమాధానాలిస్తారని తెలిపారు. 08732-295081, 230081లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. రాత్రి 7.15 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.